# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# దక్షిణ్ సబ్‌జోనల్ బ్యూరో, దండకారణ్యం

**పత్రికా ప్రకటన**

**తేదీ : జూన్ 7, 2021.**

## కామ్రేడ్ శోభరాయ్ హత్యను తీవ్రంగా నిరసించండి!

మా పార్టీ దక్షిణ సబ్‌జోనల్ కమ్యూనికేషన్ విభాగం ఇన్‌చార్జ్, డీవీసీఎమ్ కామ్రేడ్ శోభరాయ్ (గడ్డం మధుకర్)ను జూన్ 6న తెలంగాణ పోలీసులు క్రూరంగా హత్య చేయటాన్ని మా దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో తీవ్రాతి తీవ్రంగా ఖండిస్తున్నది. ఈ క్రూరమైన చర్యను నిరసించాల్సిందిగా మానవ హక్కుల సంఘాలనూ, ప్రగతిశీల ప్రజాస్వామ్య మేధావులనూ, మీడియా మిత్రులనూ, వామపక్ష పార్టీలనూ, విప్లవ ప్రజలనూ కోరుతున్నది.

అనారోగ్యం కారణంగా చికిత్స కోసం తెలంగాణలోని వరంగల్ పట్టణానికి వెళ్లిన కామ్రేడ్ శోభరాయ్‌ని జూన్ 1న తెలంగాణ ఎస్ఐబీ అరెస్టు చేసిన విషయం విదితమే. పోలీసులు ఈ విషయాన్ని ప్రకటించారు కూడా. అంతేకాదు, మెరుగైన చికిత్సకోసం ఆయనను ఆసుపత్రిలో భర్తీ చేసినట్లు గొప్పలు చెప్పుకున్నారు. తిరిగి జూన్ 6న కరోనాతో కామ్రేడ్ శోభరాయ్ మరణించినట్లు మీడియాకు ప్రకటనను ఇచ్చారు. వాస్తవానికి జరిగిందేమంటే జూన్ 1 నుండి 5 వరకు కామ్రేడ్ శోభరాయ్ కు వైద్య సేవలందించకుండా ఆ పేరుతో అమానవీయంగా హింసించి జూన్ 6న ఆయనను పాశవికంగా హత్య చేశారు. 15 రోజులలోపే అత్యంత కుట్ర పూరిత పద్ధతిలో చేసిన రెండవ హత్య ఇది. మే 27న మా పీఎల్‌జీఏ కు చెందిన ఒక ప్లాటూన్ కమాండర్ కామ్రేడ్ గంగాల్ ను ఇదే తరహాలో హత్య చేశారు. దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో మా ప్రియమైన కామ్రేడ్ శోభరాయ్ కి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి అర్పిస్తున్నది, ఆయన ఆశయాలను తుదకంటా కొనసాగిస్తామనీ మరోసారి ప్రతిన బూనుతున్నది.

కామ్రేడ్ శోభరాయ్ కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా, బెజ్జూర్ మండలం, కొండపల్లి గ్రామంలో 38 సం॥ రాల క్రితం నిరుపేద కుటుంబంలో జన్మించాడు. 16 యేళ్ల చిన్న వయస్సులోనే 1999లో సిర్పూర్ దళంలో సభ్యుడుగా చేరాడు. తరువాత 2000 సం॥లో దండకారణ్యానికి బదిలీ అయ్యాడు. ఇక్కడ కొద్ది కాలం ఆయుధాల తయారీ విభాగంలో పని చేసిన తరువాత జోన్ కమ్యూనికేషన్ విభాగానికి బదిలీ అయ్యాడు. పోలీసులు హత్య చేసే వరకు ఆయన కమ్యూనికేషన్ విభాగంలోనే తన సేవలందించాడు. తను అమరుడయ్యేనాటికి దక్షిణ సబ్‌జోనల్ కమ్యూనికేషన్ విభాగానికి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహించాడు. ఆయన పార్టీ క్యాడర్లతో, ప్రజలతో ఎల్లప్పుడు కలిసిమెలిసి ఉ ండేవాడు. గత 22 సం॥ తన విప్లవ జీవితంలో పట్టుదలతో, విరామం ఎరుగని శ్రమతో కామ్రేడ్ శోభరాయ్ అందించిన సేవలను విప్లవోద్యమం సదా గుర్తుంచుకుంటుంది.

కేంద్రంలోని బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం మోడీ మార్గదర్శకత్వంలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రజా వ్యతిరేక భూపేష్ బఘేల్, కేసీఆర్ ప్రభుత్వాలు మా పార్టీ, పీఎల్‌జీఏ, జనతన సర్కార్లను, ప్రజా సంఘాలను నిర్మూలించేందుకు సమాధాన్ ప్రహార్ దాడులను గత నవంబర్ నుండి మునుపెన్నడూ లేనంతగా వేగవంతం చేశాయి. ఈ దాడుల్లో భాగంగా దండకారణ్యంలో పోలీసు, అర్ధ సైనిక, సైనిక, కమాండో బలగాలతో క్యాంపులను పెంచడం, కూంబింగ్‌లు, చుట్టుముట్టి అణచివేత దాడులు, డ్రోన్ దాడులు సహా మరెన్నో కుట్రపూరితమైన, మోసపూరితమైన పద్ధతులను చేపడుతున్నారు. మావోయిస్టు నాయకులకు, కార్యకర్తలకూ కొరోనా సోకిందనీ, విషపూరిత ఆహారంతో తీవ్ర అనారోగ్య పాలవుతున్నారనీ, వైద్య సౌకర్యం దొరకక చాలమంది మరణించారనీ పోలీసులు నీచమైన, తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారు. దీనితో పాటు పోలీసు అధికారులు తమ చేతికి చిక్కిన వారిని హత్య చేస్తునే కరోనాను సాకుగా చూపుతూ సరెండర్ కావాలనీ, సరెండర్ అయితే మెరుగైన వైద్య సౌకర్యం అందిస్తామనీ ప్రలోభ పెడుతున్నారు. వాస్తవానికి జెనీవా ఒప్పందపు సూత్రాలలో రసాయనిక పదార్థాలను వాడకూడదనే అంతర్జాతీయ యుద్ధ నియమాలను తుంగలో తొక్కి మా సరఫరా వ్యవస్థలోని అతి బలహీనమైన ఒక లింకు ద్వారా తిండి పదార్థాలలో విషం కలిపి నమ్మకస్తుల ద్వార అందించడంతో కొద్ది మంది మా కామ్రేడ్స్ తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ప్రస్తుతం వారిలో అత్యధికులు కోలుకున్నారు. అత్యంత తీవ్ర అనారోగ్యం పాలయిన కారణంగా మెరుగైన వైద్య సేవల కోసం బయటకు పంపిన మా ఇద్దరు కామ్రేడ్స్‌ను అమానవీయంగా హత్య చేసిన ప్రభుత్వాలు ఒక వైపు కలుషిత ఆహారం ద్వారా మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు అనారోగ్యం పాలవుతున్నారనీ మరోవైపు కరోనా బాధితులయ్యారనీ పచ్చి అబద్ధాలను, కట్టు కథలను ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వాల ఈ అబద్ధపు ప్రచారాన్ని ఏ మాత్రం నమ్మకూడదనీ, దీన్ని పెద్ద ఎత్తున ఖండించాల్సిందిగా విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి మానసిక యుద్ధంలో భాగంగా ప్రభుత్వాలు చేపడుతున్న పై మోసపూరిత, కుట్రపూరిత, అమానవీయ పద్ధతులను గట్టిగా వ్యతిరేకించాలని మా పార్టీ ప్రజలకూ ప్రజాస్వామిక వాదులకూ విజ్ఞప్తి చేస్తున్నది.

**సమత**

**అధికార ప్రతినిధి**

**దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో, దండకారణ్యం**